# అపరిష్కృతం

ఎక్కడికైనా వెళ్లబోయేటప్పుడు, గుమ్మంలోంచి రోడ్ మీద కొచ్చేటప్పుడు పిడకలగంప ఎదురవ్వక్కర్లేదు, ఎంత చిన్న ఆటంకం కలిగినా ఏమిటీ దుశ్శకునం అన్న అనుమానం పెనుభూతంలాగ ఆవహించడం సహజం. అందులోనూ వెడుతున్నది ముఖ్యమైన రాచకార్యం మీద. సరిగ్గా టైం చూసి బయల్దేరిందాకావుండి ఇంకా మెట్లుదిగలేదు, ఇంతలోనే ఫోన్‌రింగయింది. నేనెళ్లబోతున్న పనికి సంబంధించిన వార్తేమైనానేమోనన్న సంశయం మనస్సుని పీక్కుతింటుంటే అడుగువెనక్కి వెయ్యకతప్పలేదు.

"సుబ్బూ!.... హమ్మయ్య! వున్నావుకదా! వెళ్లిపోయావేమోనని భయపడ్డాను. అర్జెంటుగా నువ్వు మాయింటికి రావాలి. నా స్కూటర్ పాడైంది. మనిద్దరం కల్సి మీటింగ్‌కి వెడదాం. అందులోనేనో స్పీకర్ని" అన్నాడు లోకేష్. అడుగు వెనక్కివెయ్యడంకాదు, నాలుగు కిలోమీటర్లు వెనక్కివెళ్లి, వీణ్ణి ఎక్కించుకుని ఈ ట్రాఫిక్‌జాంలన్నీ దాటుకుంటూ వెళ్లాలి. వీడేమీ సామాన్యుడు కాదు. విప్లవవాది. మా పత్రికా సంపాదకుడికి సన్నిహిత మిత్రుడు. అంచేత సరే అనక తప్పలేదు.

నవయువ కళాభారతి ఆధ్వర్యంలో 'ఆధునిక సాహిత్యం-మానవతా విలువలు' అన్న అంశం మీద కవితాగోష్టి. సభాధ్యక్షులుసరే మన సినారేగారే. ప్రారంభోపన్యాసానికి ముఖ్యమంత్రిని పిలిచేరు. సుప్రసిద్ధకవి, పాత్రికేయుడు, రాజధాని నుంచి వెలువడుతున్న 'ఓరియంట్' ఆంగ్లవారపత్రిక సంపాదకుడు అయిన ఓయస్సార్ ఈ సభకిముఖ్య అతిథి. మేము వెళ్లేటప్పటికి సభాస్థలి క్రిక్కిరిసిపోయింది. పత్రికావిలేఖర్లకోసం కేటాయించిన కుర్చీలు కూడా ఖాళీలేవు. దాంతో వెనకాల నిలబడిపోయేం.

లోకేష్ వాడి గేయాలు వినిపించడానికొచ్చేడు. రోజల్లా సభ జరుగుతుంది గనక ఏదో సమయంచూసుకుని ఓయస్సార్‌ని ఇంటర్‌వ్యూ చెయ్యమని చీఫ్ పురమాయించేడు. ఆ పనికి సంతోషంగా ఒప్పుకోడానికి ఓ ముఖ్యకారణంవుంది. ఢిల్లీలోమా అన్నయ్య మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఎఫైయిర్స్‌లో డిప్యూటీ సెక్రెటరి, ఓయస్సార్‌కి స్నేహితుడు. 'ఓరియంట్' తెలుగు ఎడిషన్ హైదరాబాద్‌నుంచి తీసుకురావాలన్న ఆలోచన వుందిట. దానికి సబ్ ఎడిటర్ కావాలను కుంటుంటే, మాటల సందర్భంలో మా అన్నయ్య నా పేరు సజెస్ట్

చేసేడుట. హైదరాబాద్ వెడుతున్నాను, అక్కడ మీ తమ్ముణ్ణి చూస్తాను, నన్ను కలవమని చెప్పు అని ఓయస్సార్ అన్నాడుట. ఈ విషయం నేనెవరికీ చెప్పలేదు. వీలైతే మీటింగ్‌కి ముందుగానే కలుసుకుని పరిచయంచేసుకుని మాట్లాడాలనుకున్నాను. కాని ఆ అవకాశం కాస్తా లోకేష్ ధర్మమా అని చెయ్యి జారిపోయింది. ఇంక ఆయన్ని లంచ్‌లోనో లంచ్‌తర్వాతో కలిసిమాట్లాడాలనుకున్నాను.

వెనకంతా సెక్యూరిటీ స్టాఫ్‌తోనూ, రాజకీయ వస్తాదులతోనూ, పోలీసులతోనూ కిటకిటలాడిపోతూంది. అసలే వేసంకాలం. పదకొండుగంటలైంది. బయట ఎండ మండిపోతుంది. లోపల ఉక్కపోత. నేనూ లోకేషూ కాస్త ప్రాణవాయువు పీల్చుకుందామని బయటకొచ్చి సిగరెట్టు వెలిగించేం. "ఒరేయ్! అసలు సభప్రారంభమై, నాటర్న్‌రావడానికి కనీసం గంటన్నర పడుతుంది. ఈలోగ ఈ జంక్షన్‌లో వున్న వైన్ షాపుకెళ్లి రెండు గ్లాసులు చిల్డ్‌బీర్ కొట్టేసొద్దాం" అన్నాడు లోకేష్. నాకున్న మానసిక ఉద్రిక్తకి, వాడికి కావల్సిన కవితా ఆవేశానికీ వాడిచ్చింది విలువైన సలహాయేకాని వీడు బీర్‌తాగడంలో అగస్త్యుడు, తీరా వెళ్లిందాకావుండి ఎంత ఆలస్యం చేస్తాడో అని నా భయం.

ఇంతలో నలిగిపోయినగళ్ల చొక్కా, మాసిపోయిన పంచె, మెళ్లో వేళ్లాడుతున్న గుడ్డ సంచితో మావైపు చూస్తూ మెట్లెక్కుతూ ఎదురైన చర్మం కప్పిన అస్తి పంజరంలాంటి శాల్తీనిచూశాను. డెబ్బయ్యేళ్లుంటాయి, నెరిసిన జుట్టు, పెరిగిన గెడ్డం, కాళ్లకి పాత చెప్పులు, చేతిలో వార్తా పత్రిక. ఎంచేతనో ఆయన పేరు హనుమంత రావయ్యుంటుందనిపించింది నావైపే పరకాయించి చూస్తూ నా ముందు నిలబడగానే నా పేరెట్టినన్ను పిలిచేటట్టు కనబడ్డాడు. ఇంతలో నేననుకున్నంతపనీ అయింది. "నాయినా నువ్వు సుబ్బారావ్వేనా? కొంచెం చత్వారం ముదిరింది. ఏమిరోజులో! ధరలు మండిపోతున్నాయి. కొత్త కళ్లజోడు కొందామంటే నాలుగొందలు రూపాయిలుట!" అంటూ పలకరించేడు.

"మీరెవరో..." అడిగేను ఎదురైన ఈ రెండో దుశ్శకునంతో.

"నువ్వు నాగేశ్వర్రావు కొడుకువికదూ! రెండేళ్లక్రితం మీ నాన్నా నేనూ యాత్రలు చేసుకున్నాక మీ యింటికొచ్చి ఓ పూట భోంచేసేను. మీ నాన్న నిన్ను పరిచయం చేసేడు. మరిచిపోయుంటావు. నాపేరు హనుమంతరావు" అన్నాడు. నా అతీంద్రియశక్తికి నేనే ఆశ్చర్యపోతూ ఈయనతో ఆనాటి పరిచయవివరాలు జ్ఞాపకంచేసుకుంటూ, "మా నాన్నగారు పోయేరు" అన్నాను, మళ్లీ మా యింట్లో ఆథిధ్యం మాటెత్తకుండా.

"తెలుసు, తెలుసు. ఈ మధ్యనే ఇక్కడ మా అల్లుడు పోయేడు. మా అమ్మాయిని చూడ్డానికొచ్చి నెలరోజులైంది. ఇక్కడ సభజరుగుతున్నట్టు ఇదిగో ఈ పత్రికలో చూసి,

యిలావొచ్చేను. నేనూ కవినే. నీకు తెలుసుగా! మీ నాన్నకి నా కవిత్వమంటే మహాయిష్టం" అన్నాడాయన.

ఆశ్చర్యంలేదు. మానాన్న పెద్దగా చదువుకోలేదు. కిరాణా దుకాణం నడుపుతూ మమ్మల్ని చదివించేడు. మానాన్నా హనుమంతురావు చిన్నప్పట్నుంచీ స్నేహితులుట. మేము ఉద్యోగాల్లోచేరేక దుకాణం అమ్మేసేడు. మా అమ్మపోయింది, హనుమంతరావు భార్య పోయింది. ఆ స్థితిలో మానాన్న తీర్థ యాత్రలకు బయల్దేరి, కూడా తోడుంటాడని, బరంపురంలో వున్న ఈ హనుమంతరావుని రమ్మని వెంటతీసుకెళ్లేడు. యాత్రలో ఆయన కవిత్వం నిత్యం వినిపించేవాడుట. మానాన్నకి ఆయనకవిత్వం నచ్చిందిట. మా నాన్న పోయింతర్వాత దానిమాటే మరిచిపోయేను.

"లోపలికెళ్లండి. ఇప్పుడే సభప్రారంభమైంది." అన్నాను.

"వీరెవరు? పరిచయంచెయ్యలేదు." అంటూ లోకేష్‌కేసి దృష్టిమళ్లించేడు.

"ఈయన లోకేశ్వర్ అని సుప్రసిద్ధ దళితవాది. విప్లవగీతాలు కూడా రాస్తాడు" అన్నాను.

"ఓహో! సంతోషం. లోగడనేను రాసిన గేయాల పుస్తకం నీకిచ్చేను. మీ పత్రికలో సమీక్షించమని. మీనాన్న కూడా నీతో చెప్పేడు. ఏంజేసేవు?" అడిగాడాయన సంచీబొత్తం విప్పుతూ.

"ఆ సంపాదకుడు మారిపోయేడు. ఆ పుస్తకం సంగతి కనుక్కుంటాను" అన్నాను, దాన్ని మా ఆఫీసుక్కూడా తీసుకెళ్లలేదని చెప్పడం యిష్టంలేక. మానాన్న పోయింతర్వాత ఆ పుస్తకం సంగతే మరిచిపోయేను.

ఒకటో క్లాసు కుర్రాడు ఏడాదిపొడుగునా వాడిన క్లాసు పుస్తకంలాంటిదితీసి లోకేష్ చేతిలో పెట్టేడు. అట్టమాసిపోయింది, పేజీలు అంచులు నలిగిపోయేయి. టైటిల్ కూడా కనబడలేదు, జ్ఞాపకమూలేదు. "మహా, ప్రసాదం" అంటూ లోకేష్ దాన్ని అందుకుని తన జిప్‌బేగ్‌లో పడేసుకుని, త్వరగా బయటకి పోయొద్దాం అంటూ సౌజ్ఞ చేసేడు.

"ఎవర్రా ఈ మహాకవి! ఇప్పుడే పుట్టలోంచి బయటకొచ్చిన వాల్మీకి లాగున్నాడు!" అడిగేడు లోకేష్ దార్లో.

"అతన్దీ బాపట్లే. ఏదో ప్రయివేట్ కంపెనీలో వుద్యోగంచేస్తూ బరంపురంలో సెటిలయ్యేడు. మా నాన్న చిరకాల స్నేహితుడు. ఉత్తరాదియాత్రలకి ఈయన్ని వెంటబెట్టుకు వెళ్లేడు. నలుగురు ఆడపిల్లలకి పెళ్లి చేసి ఆర్థికంగా బాగా చితికిపోయేడుట. మా నాన్న

చాలాసార్లు సాయం చేసేడుట. ఈయనకి కవిత్వం వినిపించడం యిష్టం. అది వినడం మానాన్నకిష్టం. ఈయన మీద అభిమానంతో ఈ పుస్తకం మానాన్నే అచ్చువేయించేడు." అన్నాను. మేము తిరిగి వొచ్చేటప్పటికి, సభలో చివర వరసలో వున్న ఆయన నా చెయ్యి పట్టుకున్నాడు.

"నేను రాసిన గేయాల్ని ఈ సభలో చదవడానికి అవకాశం వుంటుందా?" అడిగేడు.

"ఉహూఁ. ఉండదు"

"ఇందాకా పరిచయం చేశావు, లోకేశ్వర్, ఆయన చదువుతాడా?"

"ఆయన ప్రత్యేక ఆహ్వానం మీదొచ్చేడు."

"ఆహ్వాన సంఘకార్యదర్శిని కలుస్తే?"

"కల్సినా ఇప్పుడింక ప్రయోజనముండదు." అన్నాను. ఈ హనుమాన్లుతోక పెరగడం చూసి. ఈయన వాలకంచూస్తే లంచ్‌గ్రూప్‌లో జొరబడేటట్లున్నాడు.

"ఓయస్సార్‌కి నా పుస్తకం ఒకటిస్తాను. ఆయన్ని కల్సుకోవాలంటే...."

"ఆయనకి మిమ్మల్ని కల్సుకోవాలన్న కోరిక, తీరిక వుండాలి." అన్నాను, ఈయన ఆశయం పట్లజ్ఞానోదయమై.

"లంచ్ ఎక్కడ?"

"ఈ మేడపై అంతస్తులో. ప్రత్యేక ఆహ్వానితులకే ప్రవేశం. లంచ్ కూపన్లిచ్చేరు." అన్నాను, నా అంచనాతప్పుకాదని గ్రహించి.

"నీక్కూడా యిచ్చేరా?"

"లేదు" అబద్ధమాడేను.

"నీ పలుకుబడితో ఓ లంచ్‌కార్డ్ సంపాదించలేవూ? నాకు ఈ సభ చివరకంటా వుండాలనివుంది. మా అమ్మాయి దగ్గిర అయిదు రూపాయిలిచ్చుకున్నాను. బస్సుటిక్కట్టుకే రెండు రూపాయిలయింది." ఈ విషయంలో ఇంక ఉపేక్షించి లాభంలేదని తేలిపోయింది.

"ఈసభకి ఎందుకొచ్చేరో అర్థంకావటంలేదు. మీరు వినరు, నన్ను విననివ్వరు. ఒకటే నస! ఉండండి ఇదిగో యిప్పుడు లోకేశ్వర్ గేయాలు చదువుతాడు." అన్నాను.

లోకేష్ గంభీరమైన కంఠంతో రెండుగేయాలు చదివేడు. కరతాళధ్వనులు మిన్నుముట్టేయి. ఈ సంస్థకార్యదర్శి అనుకుంటా దీంతో ఈ ఉదయం కార్యక్రమం

ముగిసిందనీ, రెండుగంటల వరకూ విరామమనీ, ఆహ్వానితులకు మేడ మీద భోజనం సిద్ధంగావుందనీ, మరో ముఖ్యమైన కార్యక్రమం వుండటంవల్ల ఓయస్సార్‌గారు భోజనానంతరం వెళ్లిపోతారనీ, వారొచ్చినందుకు కృతజ్ఞతలనీ వేదిక మీదనుంచి ఎనౌన్స్ చేసేడు. లోకేష్ నాదగ్గిర కొచ్చేడు. వాణ్ణి అభినందించేను.

"నాయినా లోకేశ్వర్, నీ భాషా కంఠస్వరం, రచనాశిల్పం చాలాబాగున్నాయి. కాని ఆ భావాలతో వర్గవిభేదాలను రెచ్చగొడుతున్నావు. అది జాతి సమైక్యతకి అభ్యున్నతికి తీవ్రమైన ఘాతము...." అన్నాడా ముసలాయన.

"రెచ్చగొట్టడానికే రాశాను..." అని, నాకేసి తిరిగి "లంచ్‌కి పోదాం పద" అన్నాడు చెయ్యిపట్టుకులాగుతూ.

"బాబూ! సుబ్బారావూ! మీనాన్న స్నేహితుణ్ణి, బరంపురంనుంచి వొచ్చేను. నన్ను కూడా మీతో తీసుకెళ్లండి. ఒక్కసారి ఓయస్సార్‌గార్ని దర్శించి ఆయనకో పుస్తకమిస్తాను." అంటూ నావెనకబడ్డాడు.

ఆయన్ని లంచ్‌కు తీసుకెళ్లడం సమస్యకాదు. నా కూడా వొచ్చేడనిచెబితే నెత్తిమీదెట్టుకు మర్యాద చేస్తారు. కాని ఈయన ధోరణి చూస్తే నన్ను పట్టుకున్నట్టే ఓయస్సార్‌ని బంకలాగ పట్టుకునీలాగున్నాడు. నాకూడా రావడం నాకప్రతిష్ఠ మాటటుంచి ఓయస్సార్‌తో నాకున్న పనికి అవరోధం.

"చూడండి హనుమంతరావుగారూ! మీరు బయటెక్కడైనా భోంచేసి మధ్యాహ్నం కూడా తీరుబడిగా ఈ సభకి హాజరవ్వండి. ఇంతకంటే మీ సమస్యకి పరిష్కారం లేదు." అంటూ జేబులోంచి పదిరూపాయిలనోటుతీసి ఆయన చేతిలో పెట్టి లోకేష్ వెంట గబగబమెట్లెక్కేసేను.

లంచ్ టైంలో ఓయస్సార్‌ని కలిసి నా విజిటింగ్ కార్డ్ యివ్వగానే, "ఆc... నీ కోసమే చూస్తున్నాను. లంచ్ అవ్వగానే వెళ్లిపోయి హోటల్ హాలిడేరిసార్ట్ రూం నంబర్ నైన్‌లో వుంటాను. నా ఫ్లయిట్ అయిదు గంటలకి. నువ్వుమూడింటికి అక్కడికి వొచ్చెయ్యి. నీ బయోడేటా షీట్‌కూడా తీసుకురా. మరోముఖ్యమైన పనుంది. మీ అన్నయ్య నాకో పుస్తకం యిచ్చేడు. 'అపరిష్కృతం' అని గేయాల సంపుటి. మీనాన్నగారి స్నేహితుడెవరో వి. హనుమంతరావుగారు రాశారు. హియీజె జీనియస్. సినారేకి కూడా చూపెట్టేను. అద్భుతంగావున్నాయని ఆయన కూడా మెచ్చుకున్నారు. ఆ హనుమంతరావుగారు పాపం! ఆర్థిక దుస్థితిలో వున్నారుట. ఆ సమస్యని కూడా పరిష్కరించడానికి సినారేతో సంప్రదించి ఓ పథకం సిద్ధం చేశాను. పుస్తకం మీదవున్న ఆయన బరంపురం ఎడ్రస్‌కి లెటర్‌రాసి

పదిహేను రోజులైంది. ఇక్కడకొచ్చి కల్సుకోమని. ప్రయాణం ఖర్చులకోసం ఓ డ్రాఫ్ట్‌కూడా పంపేను. మరి జవాబురాలేదు. బహుశా ఆయన బరంపురంలో లేడేమో. ఆయన గేయాలుకొన్ని ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చెయ్యదల్చుకున్నాను. ఆ విషయంలో కూడా ఆయనతో మట్లాడాలి. ఎలాగైనా ఆయనని కలవాలి. నువ్వెలాగైనా ఆయన్ని పట్టుకుని నాకు ఢిల్లీకి ఫోన్‌చేయించు. ఆయన అక్కడికి రాగలిగితే సరేసరి, లేకపోతే నేనే మరోసారి వొస్తాను లేదా సినారేగారిని కలవమంటాను.'' అన్నాడు ఓయస్సార్. ఏం మాట్లాడాలో తెలీక నాకు ముచ్చమటలు పట్టేయి. కిందకెళ్లి ఆయన్ని తీసుకొస్తే ఏం రభస జరుగుతుందోనన్న భయం.

“ఏమిటి ఆలోచిస్తున్నావు. ఇదిగో ఆయన ఎడ్రస్.”

“ఆయన్ని ఎలాగైనా పట్టుకుని మీకు ఫోన్ చేయిస్తాను.” అన్నాను.

ఆయన్ని ప్రసన్నుణ్ణి చేసుకోవాలంటే ముందు జరిగిందానికి క్షమాపణ చెప్పుకోవాలి. కాస్తటైం తీసుకోవడం శ్రేయస్కరం అనిపించింది.

“వెరీగుడ్. ఇరవైయ్యేళ్లక్రితం రాశాడు. అయిదేళ్లక్రితం మీనాన్నగారు అచ్చేయించేరుట. మీనాన్నగారు పోయింతరవాత ఆ పుస్తకం కాపీ దొరికితే మీ అన్నయ్య జాగ్రత్త చేశాడు. ఆయన కవితల్లో మానవతావాదం పొంగి పొర్లుతుంది. వర్ణభేదం, వర్గభేదం, దళితవాదం అంటూ సమాజాన్నిచీల్చి పరస్పర అవిశ్వాసం ద్వేషం రెచ్చగొట్టి జాతిని బలహీను పరచే కవిత్వాలు రచనలు వస్తున్న ఈ రోజుల్లో సమసమాజనిర్మాణానికి, శాంతియుత పరిష్కారాలకి దోహం చేసే ఆయన కవితలొక చైతన్య స్రవంతి....'' ఆయన మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఓయస్సార్ కారెక్కి హోటల్‌కి వెళ్లిపోయిన తర్వాత హనుమంతరావుగారికోసం సభంతా గాలించేను. కనబడలేదు. నేనిచ్చిన పదిరూపాయిలనోటు నలిపి విసిరేసి విసవిస బయటకి వెళ్లి పోయినట్లు చూసిన వాళ్లు చెప్పేరు. ఇంకకెక్కడని వెతకను! ఆయన కూతురెవరు? ఇల్లెక్కడ? పదిహేను రోజుల తర్వాత బరంపురం ఎడ్రస్‌కి నేను రాసిన పోస్ట్‌కార్డుకి అక్కడున్న ఆయన కూతురు జవాబు రాసింది. నాలుగు రోజులక్రితం ఆయన కలలు కన్న లోకానికి వెళ్లిపోయేడని ఫలానారోజున వైకుంఠ సమారాధనని.

** రచన 1997*